క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆశ్వీయుజ మాసం చివరి శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్య స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో భక్తుల సందడి

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహ స్వాముల ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. స్వాములకు అభిషేకాలు, కుంకుమార్చలు చేశారు. భక్తులకు సంజీవరాయ అన్నదాన సత్రంలో చెన్నకేశవ స్వామి ఆలయం వెనుక పైపు అన్నదానం ఏర్పాటు చేశారు. సంజీవరాయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి శనివారం ప్రొద్దుటూరు మండలంలోని కాకిరేనిపల్లెకు చెందిన చేగిరెడ్డి నారాయణరెడ్డి రూ.20,116, ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలంకు చెందిన జి.సంజీవ గౌడ్ రూ.22,200, కర్నూలుకు చెందిన ఎస్‌డీ తేజేశ్వరరావు రూ.25,001, నంద్యాలకు చెందిన ఎన్.సంజీవ రామ గోపాల శర్మ రూ.25,116, రాజుపాళెం మండలంలోని టంగుటూరుకు చెందిన గువ్వల రాజగోపాల్‌రెడ్డి రూ.21,116 నగదును ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మినారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్ ఇచ్చారు. మొత్తం రూ.1,13549 వచ్చిందని చెప్పారు. దాతలందరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శాలువ కప్పి పూలమాల వేసి సత్కరించారు.

చెకుముకి సైన్స్ పరీక్షలు

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలు విజయవంతం అయ్యాయి. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఆచారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో 400 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సహకరించిన ఉపాధ్యాయులందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

22న ఎస్టీయూ సర్వసభ్య సమావేశం

మైదుకూరు : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ ఆవరణలో జరిగిన సమావేశంలో ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్, మాజీ ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, అసోసియేట్ అధ్యక్షుడు జి.మల్లేశ్వరరెడ్డి, మైదుకూరు రీజియన్ కన్వీనర్ వెంకటేశ్వరరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బీకే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



టి.వెంకటసుబ్బయ్య



ఎస్.వి.సుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) బద్వేలు మండల నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన రీజియన్ సర్వసభ్య సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎం.డి.ఇలియాస్‌బాష, సంగమేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. ఇందులో మండలశాఖ అధ్యక్షుడుగా టి.వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వి.సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా విజయనరసింహులను ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షులుగా జి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, భారతి, వెంకటరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శులుగా రవీంద్రారెడ్డి, నాగరత్నాచారి, కార్యదర్శులుగా రంతుల్లా, రవీంద్రారెడ్డి, లక్ష్మిదేవి, వెంకటసుబ్బయ్య, గంగయ్య, ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు, జాన్‌వెస్లీ, జిల్లా కౌన్సిలర్లుగా చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, శివరాజ్, రామసుబ్బయ్య, జకరయ్య, మునెయ్య, థామస్, ఎస్.వెంకటసుబ్బయ్య, నూర్‌అహ్మద్, రామకృష్ణయ్యలను ఎన్నుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండాపురం : ఏటూరు గ్రామంలో శనివారం పేకాట అడుతున్న ఐదు మందిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి రూ.2140 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్‌ఐ ఆర్.శివనాగిరెడ్డి తెలిపారు.

పర్యావరణ రహిత జీవనాన్ని గడపాలి



ప్రొద్దుటూరు : ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



ప్రొద్దుటూరు : సైకిల్ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అధికారులు



బద్వేలు : సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ పర్యావరణ రహిత జీవనాన్ని గడపాలని డాక్టర్ హిమబిందు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తెలిపారు. ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలోని టీబీ రోడ్డు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా శనివారం స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యవంతమైన జీవనం గురించి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనం జరుపుకొనే ఈ దీపావళి హానికర టపాసులు కాల్చకుండా సహజ దీపాల కాంతులతో పర్యావరణ రహిత దీపావళిగా జరుపుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, సీఓ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్‌ను తొక్కండి.. గాలి కాలుష్యాన్ని తగ్గించండి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం విధిగా అలవాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి విజయకుమార్ సర్కిల్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో తప్ప మోటార్ వాహనాలను తగ్గించాలని తెలిపారు. సైకిల్ వాడటం వల్ల గాలి కాలుష్యం ఉండదని, ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొన్నా రు. సైకిల్ తొక్కండి.. కాలుష్యాన్ని నివారించండి అనే నినాదాని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

ఖాజీపేట : పరిసరాలను శుభ్రంగా స్వచ్ఛంగా ఉంచడం మనందరి బాధ్యతగా భావించాలని ఎంపీడీఓ దివిజా సంపతి అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా శనివారం ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛత వలన కలిగే లాభాల గురించి తెలియజేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను శుభ్రంగా ఉంచేందుకు మొదట ప్రాధాన్యతగా తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రమణారెడ్డితోపాటు ఉపాధ్యాయులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను బాధ్యతగా నాటాలి

చాపాడు : సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుందని ఏపీఎస్‌ఐడీసీ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎయిర్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఆవరణలో ఏపీఎస్‌ఐడీసీ డైరెక్టర్, ఎంపీడీఓ వీరకిశోర్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలితో ఎన్నో ప్రయోజనాలు

బద్వేలు అర్బన్ : స్వచ్ఛమైన గాలిని పీల్చడం ద్వారా మానవాళికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, ఇందుకోసం ప్రతిఒక్కరు గాలి కాలుష్యం కాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శుద్ధవాయువు అనే నినాదంతో స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ సీఐ లింగప్ప, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్‌అలీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్, ఎంఈఓ చెన్నయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి భావితరాలకు అందిద్దాం

పోరుమామిళ్ల : భావితరాలకు స్వచ్ఛమైన గాలి, కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ చక్కని గాలి వల్లనే మనం ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సులోచన, వెంకటరావు, హరిబాబు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, పర్వీన్, గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు కార్యాలయంలో..

స్థానిక ఫారెస్టు కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి, పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది శ్రీనివాసరావు, రమణ, కరుణాకర్, రత్న సుభాషిణి, సుజాత, కిషోర్, వెంకటేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



చాపాడు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది



పోరుమామిళ్ల : కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



పోరుమామిళ్ల : ఫారెస్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న అటవీ సిబ్బంది

పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం అవసరం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పోరుమామిళ్ల : పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం అవసరమని, పార్టీని పటిష్ఠంగా నిర్మించడానికి నిరంతరం ప్రజలతో అనుబంధ కార్యక్రమాలు సాగాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్నకాలంలో రాష్ట్ర రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజాసమస్యలు పట్టుకుని ముందుకు సాగడమే కాకుండా ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించేందుకు అన్ని స్థాయిల్లో శక్తివంతమైన సంస్థాగత వ్యవస్థ అవసరమన్నారు. ఈ అంశంపై పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆయన ఇచ్చిన ఆదేశాల మేరకు మండల, గ్రామ, బూత్ స్థాయిలో పార్టీ కమిటీలను సక్రమంగా పునర్ నిర్మాణం చేసి, ప్రజలకు చేరువగా పని చేసేలా బలోపేతం చేయాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని శాఖల్లో పార్టీకి చురుకైన నాయకత్వాన్ని ఏర్పరచాలని, స్థానిక సమస్యలను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని స్థాయిల్లో కమిటీల జాబితాలను సమగ్రంగా సిద్ధం చేయాలని, పార్టీ జిల్లా, మండల, గ్రామస్థాయి అనుబంధ విభాగాలకు, అలాగే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు సుదర్శన్, సీయం బాష, చౌదరి రామకృష్ణారెడ్డి, రవి చంద్రారెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పంగా గురివిరెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాళ్లపల్లె నరసింహులు, రాజీవ్‌బాష, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, చాపాటి లక్ష్మినారాయణరెడ్డి, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఓ. ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సునీల్, మస్తాన్ (మని), ఎంపీటీసీ ఇస్సాక్, హుసేన్‌పీరా, సాయి నారాయణరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించకుంటే చర్యలు తప్పవు

మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి




బద్వేలు అర్బన్ : మున్సిపల్ సిబ్బంది, అధికారులు ప్రజలు, ప్రజాప్రతినిధులు తెలిపిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ ఛైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమ స్యలను మళ్ళీ జరిగే సమావేశానికి కూడా పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో పట్టణంలో విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని, దీనిపై దృష్టి సారించాలని సమావేశానికి హాజరైన ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈని ఆదేశించారు. అలాగే పట్టణంలో రోజురోజుకు కుక్కల దాడులు అధికమవుతున్నాయని, నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు..

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలోని పలు హౌసింగ్ లేఅవుట్‌లలో కొంత మందికి బిల్లులు మంజూరు కాలేదని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ సమావేశం దృష్టికి తీసుకురాగా ప్రాధాన్యత క్రమంలో ప్రతిఒక్కరికి బిల్లులు చెల్లిస్తున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హౌసింగ్ డీఈ తెలిపారు. అలాగే పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఔటర్ బైపాస్ రోడ్డు మీదుగా భారీ వాహనాలు వెళుతున్న నేపథ్యంలో పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ సమయాన్ని కుదించడంతో పాటు బైపాస్ రోడ్డులో సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని వైస్‌చైర్మన్ సమావేశం దృష్టికి తీసుకురాగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. స్థానిక సిద్దవటం రోడ్డులో డ్రైనేజీ ఏర్పాటు కోసం కాలువ తవ్వి 25 రోజులు కావస్తున్నా కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో సంబంధిత వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని 23, 13 వార్డుల కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, మహమ్మద్ హసాన్ సమావేశం దృష్టికి తీసుకురాగా సిద్దవటం రోడ్డులోని చికెన్ దుకాణాల వ్యాపారులు నీటిని, వ్యర్థాలు వదులుతుండటంతో పనులు చేసేందుకు కుదరడం లేదని కాంట్రాక్టర్ తెలిపారని, రెండు, మూడు రోజులు నీరు వదలకుండా ఉంచితే పనులు పూర్తి చేయిస్తామని కమిషనర్ తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులను వంచన చేయకండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష

బద్వేలు అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆర్థికపరమైన అంశాల్లో వంచనకు గురిచేయకుండా ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్టీయూ రీజియన్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరికి ఐఆర్ ప్రకటించి 12వ పీఆర్సీ కమిషన్‌ను తిరిగి నియమించి నిర్ణీత కాలంలో 12వ పీఆర్సీ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమణారెడ్డి, కె.బాలగంగిరెడ్డి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య, రీజియన్ కన్వీనర్ సుబ్బరాయుడు, ఆయా మండలాల నాయకులు రవికేశవ్, పద్మనాభరావు, జకరయ్య, శివరాజ్, వెంకటలక్షుమ్మ, భారతి, రమేష్‌రాజా, నరసింహారెడ్డి, మునెయ్య, సిద్దారెడ్డి, శ్రీకాంత్, తిరుపాల్‌రెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంపుపై శిక్షణ

మైదుకూరు : మండలంలోని గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచేందుకు మార్గాలపై సర్పంచ్‌లు, అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీల్లోని గ్రామాల అభివృద్ధికి వ్యూహాలు, వనరుల వినియోగం, నూతన ప్రాజెక్టులు, నిధుల సమీకరణ మార్గాలపై ఈ శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. అదేరంగా పీ4పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్-47 అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని 11 సచివాలయాల సిబ్బందిని 179 క్లస్టర్లుగా విభజించినట్లు తెలిపారు. వారు తమ పరిధిలోని బంగారు కుటుంబాలను కలిసి వారి అవసరాలను తెలుసుకొని జీఎస్‌డబ్ల్యూఎస్ అప్లికేషన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ ఫ్లోరెన్స్‌ఫిబి, ఏఓ నాగేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆదాయ పెంపునకు కృషి చేయాలి

పోరుమామిళ్ల : సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సమిష్టిగా, వినూత్నంగా ఆలోచించి పంచాయతీలకు స్వంత ఆదాయం పెంపునకు కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సూచించారు. శనివారం సభాభవనంలో ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన శిక్షణా తరగతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాయం పెంపునకు అందరూ ప్రత్యేక ఆలోచన చేయాలన్నారు. శిక్షకులు ఓబులేసు, హరికృష్ణ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, ఆదాయాల అంచనా, ప్రణాళిక తయారీ తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఆదాయాలను ప్రజలకు అవసరమైన ప్రధాన వసతుల కల్పనకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఓన్ సోర్స్ రెవెన్యూ అంశంపై శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరకిశోర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కోసం సంపద సృష్టిని కనుగొనాలన్నారు. పంచాయతీల ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పంచాయతీలో ఆదాయ వనరులను గుర్తించి ఆదాయం వచ్చేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, టిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అబార్షన్లపై ఆడిట్

మైదుకూరు : బద్వేలు డివిజన్ వైద్య ఆరోగ్య కేంద్రాల్లో సెప్టెంబర్‌లో నమోదైన అబార్షన్లపై శనివారం మైదుకూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆడిట్‌ను నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్, గైనకాలజిస్ట్ వి.సుధ సెప్టెంబర్ నెలలో జరిగిన అబార్షన్ల వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డివిజన్‌లోని హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని శివశంకర్ కాంప్లెక్స్‌లో ఉన్న బీసీ సమాఖ్య కార్యాలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 1 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సమాఖ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. డాక్టర్లు రాజశేఖర్ వర్మ, హరీష్‌బాబు, నాగశేఖర్‌రెడ్డి, బీఎల్‌ఎన్ రెడ్డి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, ఎముకలు, సాధారణ జబ్బులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తారని తెలిపారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో పరిధిలోని ఆరు, ఏడు వార్డుల కౌన్సిలర్లు వై.జయంతి, గుర్రం లావణ్యల ఆధ్వర్యంలో శనివారం వార్డు కమిటీల ఏర్పాటు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గతంలోలా కాకుండా పార్టీ తప్పక ప్రతి కార్యకర్తను గుర్తించే పనిలో ఉన్నారు. కమిటీల ఏర్పాటు పూర్తయిన తర్వాత జనవరిలో ఐడీ కార్డులు ఇస్తారని, ప్రతి కార్యకర్త వివరాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాష్ బోర్డులో ఉంటాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరిగాయని, ఈ ప్రభుత్వం వచ్చాక తాము మంజూరు చేసిన పనులను పూర్తి చేయలేని దుస్థితిలో ఉందన్నారు. ప్రతి వార్డులో 150 మందితో వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాగుల శాంతి, మన్నే సత్యం, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, పార్టీ నేతలు గుర్రం ప్రకాష్, కమ్మక్క, 6వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పంగా సురేష్‌యాదవ్, నరసింహ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహార అలవాట్లతో వ్యాధులకు దూరం



మాట్లాడుతున్న సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగయ్య

మైదుకూరు : ప్రతి ఒక్కరూ మంచి ఆహారాన్ని తీసుకునే అలవాటు చేసుకుంటే వ్యాధులు దరిచేరవని మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగయ్య అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం ఆరోగ్యం – పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగయ్య మాట్లాడుతూ ఆహారంలో నూనె, ఉప్పు పరిమాణాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. పోషకాహార అడోల్సెంట్ కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళలు ఐరన్, పోలిక్ యాసిడ్ అధికంగా ఉన్న ఆకు కూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా హిమోగ్లోబిన్ స్థాయి నిలబెట్టుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, సీహెచ్‌సీ రక్తనిధి నిర్వాహకుడు ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కళాశాల ఆవరణలో, బొటానికల్ గార్డెన్‌లో మొక్కలను నాటారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైదుకూరు విద్యార్థినులు



ప్రిన్సిపాల్ నిర్మల, పీఈటీ శైలజతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మైదుకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మైదుకూరు మండలానికి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులు కె.చిట్టి, శ్రావ్య, ఎస్.గాయత్రి, ఎం.చరిత అన్నమయ్య జిల్లా చిన్నమండెంలో జరిగిన అండర్-19 వాలీబాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.నిర్మల తెలిపారు. కడప జూనియర్ బాయ్స్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 చెస్‌పోటీలో ఎం.పల్లవి ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ నిర్మల, పీఈటీ శైలజ అభినందించారు.

నాణ్యత కలిగిన టపాసులు విక్రయించాలి

పోరుమామిళ్ల : దీపావళి సందర్భంగా బాణ సంచా దుకాణాల నిర్వాహకులు నాణ్యత కలిగిన టపాసులు విక్రయించాలని సీఐ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధికారిక లైసెన్స్ కలిగిన నిర్వాహకుల నుండి మాత్రమే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్నవారు మాత్రమే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు నిర్ణయించిన ప్రదేశాల్లోనే స్టాల్లు ఏర్పాటు చేయాలని, నివాస ప్రదేశాలకు దూరంగా ఉండాలన్నారు.

అనుమతులు లేని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకుని డాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్ పేర్కొన్నారు.

శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం పది ఆసుపత్రులకే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నుండి అనుమతులు ఉన్నాయని, మిగిలిన ఏ ఒక్క ఆసుపత్రికి కూడా అనుమతులు లేవని అన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ ఏరియా నాయకులు రామకృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మునిరత్నం, భరత్ తదితరులు పాల్గొన్నారు.